# దశమ గ్రహం

నాకో ఫ్రెండున్నాడు. చిన్న ప్రభుత్వోద్యోగి. ఆశలగాలి. అభివృద్ధి వెలుగు సోకని ఇరుకు జీవితాన్ని గడుపుతున్నాడు. అన్నట్లు, అతడి ముక్కు పొడుగ్గా కొటేరేసినట్లుగా వుంటుంది. అంచేత మేమందరం అతడిని పొగుడు ముక్కు ఫ్రెండూ అని పిలుస్తుంటాం.

అతడొక ఇంటో అద్దెకుంటున్నాడు. గత చాల ఏళ్ళుగా ఆ ఇంట్లోనే వుంటున్నాడు. ఆ యింటి ఓనరు లావుగా, దానికి తగ్గ పొడుగ్గా వుంటాడు. ఆయనకి వేలమీద జీతం వచ్చే చక్కటి ఉద్యోగం. సిటీలోనే రెండు మూడు ఇళ్ళు, ఒక బ్రాండ్ న్యూ స్కూటరు వున్నాయి. కాని అదేమిటో చిత్రంగా , విరుద్దంగా, అయనకి పిల్లలు కూడా ఎక్కువే అందులో సగం ఆడ.

ఈమధ్యన ఆయనో కూతురికి పెళ్ళిచేసేడు. ఆ వచ్చిన అల్లుడు కడు ఘటికుడు, బ్రతకనేర్చినవాడు. మామగారి ఆస్థిని , హొదాని చూసి ధాంమ్మని బోర్లా పడిపోయేడు. అసలివ్వన్ని చూశాకే అతగాడా పిల్లని లవ్ చేసేడని అమ్మలక్కల సర్వే రిపోర్టు చెబుతోంది. అతడి వైపున వాళ్ళంతా అంతంత మాత్రం వాళ్ళవంటచేత పెళ్ళంటూ చేసుకుంటే ఇటువంటి పిల్లనే చేసుకోవాన్న థియరీని ఏర్పరచుకున్నట్లు కథనం, అతడెలాగో తంటాలుపడి ఎంఎస్సీ అయిందనిపించి, చిన్న ఉద్యోగాన్ని , సెకండ్ హాండ్‌స్కూటర్ని సంపాయించేడు. అప్పట్నించి అతగాడిని పట్టుకోవటం మహాకష్టంగా వుంది. భూమ్మీద నిలబడటంలేదు. అతగాడు నిలబడకపోతే మనకేం గొడవలేకపోను. మా పొడుగు ముక్కు ఫ్రెండునిగూడాస్థిమితంగా నిలబడనీయటంలేదు. ఎట్లాగంటే....

మా ఫ్రెండు ఇంటి ఓనరు, అతడికి మామగారు అయిన ఆ పెద్ద మనిషి ఎంతైనా అల్లుడు కదాని, ఒక పోర్షన్ ఖాళ్ళీ చేయించి ఉచిత గృహవసతి కల్పించాడు. అది మాఫ్రెండు పక్కపోర్షన్‌లో వుంటున్న వాళ్ళందరూ గూడా తనలాగా ఫ్రీగా వుంటున్న బాపతులా భావించి వాళ్ళపై అధార్టీ చెలాయించటం మొదలెట్టాడు.

కరెంటు , వాటరు, ప్రాజెక్టు ఫండ్సులా తెగ వాడేస్తున్నారని, పిల్లలు అల్లరి చేస్తున్నారని, పెద్దవాళ్ళు చెయ్యటంలేదని ....ఓహ్.... ఒకటేమిటి అతనిష్టం వచ్చినట్టల్లా అనసాగేడు మా ఫ్రెండు మాహాసాత్వికుడు . అన్నిటిని భరించాడు. ఇవన్నీ చాలవన్నట్లు, ప్రతి శనివారం సాయంత్రం సుగ్రీవ సైన్యంలాంటి ఫ్రెండ్సుని పిల్చి లోపల చిన్న సైజు బారుపెట్టి అక్కడ్నించి కేకలు, పాటలు, ఈలలు, ప్రతి శనివారం భార్యని టి.వి.సినిమా చూడమని పుట్టింటికి పంపేవాడు. అంచేత భర్తగారి విన్యాసాలు ఆ పిల్లకిగాని, ఆ తండ్రికిగాని తెలీవు.

మా ఫ్రెండు ఎంత సాత్వికుడైనా ఇది మాత్రం భరించలేకపోయాడు. ఇలాక్కాదని ఒక రోజు అతడికి పొలైట్‌గా చెప్పేడు. తద్వారా అతడి ఆగ్రహ నికి గురైనాడు. మావగార్కి మావాడ్ని గురించి కథల్చెప్పి, ఆ పోర్షన్ ఇంకెవరికైనా ఇస్తే రెట్టింపు అద్దె వస్తుందని, ఎందుకు మీరిలా నష్టపోవాలన్చెప్పి , వర్రీ అయికంటతడిగూడా పెట్టేడు. అది చూసిన మావగారు అల్లుడికి తనపై గల శ్రద్ధకి , వాత్సల్యానికి , ముగ్ధుడయి మా ఫ్రెండుని ఖాళీ చెయ్యమన్నాడు. ఇళ్ళకోసం మావాడు పడుతున్న అవస్థలు చూస్తుంటే నాకు కళ్ళు చెమ్మగిల్లి నాయి. గదులుచూస్తే జైలు గదులు అద్దెలు చూస్తే ఆకాశంలో . ఏ ఇల్లు చూసినా ఏముంది గర్వకారణం – గాలియా , వెల్తురా , ఏవీ లేవు., అద్దెకు దిగినవాడిని పీక్కుతినడం మినహా, అందుకే మా ఫ్రెండుని ఇప్పుడుంటున్న ఇంటిని ప్రభుత్వాధీనం అయ్యేటట్లు చూడమని గూడా సలహా విసిరేను. వద్దంటాడు మా వాడు.

అందరూ ఇలా నిమ్మకి నీరెత్తినట్లు స్థబ్దుగా వుండడం చేతనే ప్రభుత్వ శాసనాలు కాగితాపైన సచివాలయం కటకటాల వెనుక వుండిపోతున్నాయని విసుక్కు న్నాను. అఫ్‌కోర్స్ మా ఫ్రెండుకి ఇల్లు దొరికిందిలెండి. అద్దె అతడి తాహతుకు మించినదే అయినా, ముందీ న్యూసెన్స్ వేల్యూ తప్పించుకోవటానికి వెళ్ళిపోతున్నాడు.

కాబట్టి ఇప్పుడు నాదిగులు మా పొడుగుముక్కు ఫ్రెండు గురించి కాదు. మా వాడొదిలేసి ఇంటి ఓనరు గురించి. ఆయనెక్కడన్నా తటస్థపడితే ' అయ్యా ఓనరుగారూ మీ అల్లుడుగారు ఏ రూట్లో వస్తున్నాడో కాస్త గమనించండి . స్పీడు బ్రేకర్స్ ఏర్పాటు చెయ్యటం ఎంతైనా మంచిది. లేకుంటే అతగాడు మెల్లి మెల్లిగా అన్ని పోర్షన్స్‌లో వాళ్ళకి వుద్వాసన చెప్పి , వాటిల్లో తన బంధుమిత్రులందర్నీ , నింపేసి ఆయన జెండామార్చి ప్లేటు ఫిరాయించి , మేకుగామారే ప్రమాదం వుంది ' అని చెప్పాలనివుంది.

అదే నోటితో ఆ అల్లుడుగారితో ' నాయనా చిరంజీవి మావ ఆస్థి ఎప్పటికి మనదికాదు. పిల్లనిచ్చే దే గాని, ఆస్థి నివ్వడు – అంచేత అనవసరంగా కాలరెగరేసి

అందరిపైన  ధ్వజం  ఎత్తకు – నీ – పరిస్థితేమిటో  ఆలోచించు . కష్టపడి  పన్చేసి  వృద్ధి లోనికి రా ’ అని

కాని మా ఫ్రెండు  పోనిద్దు మనకెందుకురా అంటున్నాడు.  ఫ్రెండు  మాటని కాదంటే  ఏం బావుటుంది చెప్పండి.  అంచేత  ఆ టాఫిక్కుని  ఇక టక్కున  ముగిస్తా.

------- అయ్యిపోయింది -------